# నిమజ్జనానికి వేళాయే..!

**గణేష్ శోభాయాత్ర, నిమజ్జనంలో నిర్లక్ష్యం వహించొద్దు**

- ముందస్తుగా అన్ని జాగ్రత్తలు పాటిస్తేనే క్షేమం
- పల్లె, పట్టణాల పరిధిలో కొలువుదీరిన గణనాథులు
- నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు (ఫైల్)



నిమజ్జనానికి తరలివెళ్తున్న విగ్రహాలు(ఫైల్)

**చుంచుపల్లి:** జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి నవ రాత్రి ఉత్సవాలను భక్తులు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. పల్లె, పట్టణాల్లో భక్తి పారవశ్యంతో ఆదిదేవుడిని కొలుస్తున్నారు. నవరాత్రోత్సవాలు ముగియనుండడంతో సోమ, మంగళవారం జిల్లాలో వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు జరగనున్నాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 4 వేల వినాయక విగ్రహాలు ఏటా భద్రాచలంలో గోదావరి నదికి నిమజ్జనానికి తీసుకెళ్తారు. మిగతా విగ్రహాలను స్థానికంగా జలాశయాల్లో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యాన భక్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ నిమజ్జన ఉత్సవాలను ఆనందంగా ముగించేలా సహకరించాలని అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, జలాశయాలు నీరుతో పూర్తిగా నిండిపోయి నిండుకుండను తలపిస్తున్నాయి. లోతుల్లోకి వెళ్లి నిమజ్జనం చేస్తే ప్రమాదాలు జరిగే వీలుంటుంది. వీటి విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే గణేష్ నవరాత్రి సంబురాలకు ప్రశాంత వాతావరణంలో ముగింపు పలకొచ్చు.

**వాహనదారులు పాటించాల్సినవి..**

- నిమజ్జన శోభాయాత్రలో ప్రతిమలను తీసుకెళ్లే వాహనాల డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలి. పొరపాట్లు జరగకుండా అనుభవజ్ఞులైన డ్రైవర్లను ఎంచుకోవడమే కాక వారికి తగిన సూచనలివ్వాలి.
- డ్రైవర్ మద్యం, మత్తు పానీయాలు, పదార్థాలకు దూరంగా ఉండాలి.
- డ్రైవర్ పక్కన, వాహనం ముందు భాగంలో ఎవరినీ కూర్చోనివ్వకూడదు. అలాగే, ప్రతిమ వద్ద ఎక్కువ మంది ఉండకుండా చూసుకోవాలి.
- రహదారులపై గుంతలు, విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

**శోభాయాత్రలో జాగ్రత్తలు ఇలా..**

- ఉత్సవ సమితి బాధ్యులు, భక్తులు పోలీసుల సూచనలు పాటించాలి.
- శోభాయాత్రలో పూర్తిగా సంయమనం పాటించాలి. యువకులు ఎలాంటి ఉద్వేగాలకు పోకూండా క్రమపద్ధతిలో వెళ్లాలి.
- విగ్రహాలను మండపం నుంచి వాహనంపైకి చేర్చే సమయాన విద్యుత్ తీగల విషయంలో జాగ్రత్త వహించాలి.
- సెట్టింగుల సమీపంలో బాణాసంచాలు పేల్చకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**నిమజ్జన సమయంలో..**

- నిమజ్జన సమయంలో అధికార యంత్రాంగం ఏర్పాటు చేసే క్రేన్లు, తదితర వాటి సమీపంలోకి వెళ్లకూడదు.
- పోలీసులు, నిమజ్జనం చేసే సదరు నిర్వాహకుల హెచ్చరికలు కాదని చెరువులు, నదులు, కుంటలు, ప్రాజెక్టుల నీటిలోకి దిగేందుకు సాహసించొద్దు. ఈత రాని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ నీళ్లలోకి దిగకూడదు.
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పూర్తిస్థాయిలో సామరస్య పూర్వక వాతావరణం కలిగేలా చూడాలి.
- నిర్వాహకులు శాంతి, సామరస్యపూర్వకంగా ఉండాలి. ప్రధానంగా ఊరేగింపు సమయంలో ఆధ్యాత్మిక చింతన ప్రజ్వరిల్లేలా దేశ సంస్కృతి, సంప్రదాయాలను వెల్లివిరిసే భక్తి పాటలు, నృత్యాలు, కోలాటాలు తదితర వాటిని చేసుకుంటూ వెళ్లాలి.
- మండపాల నిర్వాహకులు తమతో వచ్చే సభ్యులను తీసుకెళ్లడంతో పాటు వారిని తిరిగి ఇంటికే చేర్చే వరకు బాధ్యతగా వ్యవహరించాలి. ఏదైనా చిన్న సంఘటన జరిగినా దానిని సామరస్యంగా పరిష్కరించేలా చూడాలి.

## క్లుప్తంగా

### బస్‌పాస్‌ల పంపిణీ



బస్‌పాస్‌లు అందజేస్తున్న సిబ్బంది

**టేకులపల్లి:** దివ్యాంగులు ఆర్టీసీ రాయితీ బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం డిపో ఆర్టీసీ బస్‌పాస్‌ల ఇన్‌చార్జ్‌లు ఇసన్నపల్లి శామ్యూల్, బి.నరేంద్రకుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం కోయగూడెం పంచాయతీ కార్యాలయంలో దివ్యాంగులకు బస్‌పాస్‌ల శిబిరం నిర్వహించి పాసులు అందజేశారు. పాస్ పొందిన దివ్యాంగులు రాష్ట్రం మొత్తం ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో 50 శాతం రాయితీతో ప్రయాణం చేయవచ్చన్నారు. మాజీ సర్పంచ్ కోరం సురేందర్, కణతాల అన్నాజీ పాల్గొన్నారు.

### ఊరేగింపుల్లో డీజేలు నిషేధం

**జూలూరుపాడు:** గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నిర్వహించే ఊరేగింపుల్లో డీజేలు వాడొద్దని ఎస్సై బి.రాణాప్రతాప్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జన ఊరేగింపులో నిబంధనలు అతిక్రమించి డీజేలు వినియోగిస్తే వాటిని సీజ్ చేయడంతోపాటు, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. మద్యం సేవించి న్యూసెన్స్ క్రియేట్ చేయడం, గొడవలు, ఘర్షణలు ప్రేరేపించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### కార్మికుల నిధులు ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వొద్దు..



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

**ఇల్లెందు:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల నిధులను ప్రైవేట్ బీమా కంపెనీలకు ఇవ్వొద్దని రాష్ట్ర భవన నిర్మాణాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా ఇల్లెందులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. శనివారం ఇల్లెందులో ఇఫ్టూ కార్మిక సంఘాల నేతలు పట్టణంలోని ప్రధాన వీధుల్లో సంతకాలు సేకరించారు. రావూరి ఉపేందర్, నాగేశ్వరరావు, సారంగపాణీ, యాకుబ్‌షావలీ, శేషయ్య, రమేష్ పాల్గొన్నారు.

### సభను జయప్రదం చేయండి

**జూలూరుపాడు:** 17న జిల్లా కేంద్రం కొత్తగూడెంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం అన్నారుపాడు గ్రామంలో జరిగిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి ధర్మా, నాయకులు గోపాల్‌రావు, సతీష్, జగదీష్, సుజాత, వీరన్న పాల్గొన్నారు.

### భోజన సౌకర్యం ఏఐటీయూసీ కృషి ఫలితమే

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కృషి ఫలితంగా సింగరేణి హెడ్డాఫీస్ క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని ప్రారంభిస్తుందని ఏఐటీయూసీ నాయకులు వంగా వెంకట్, రమణమూర్తిలు తెలిపారు. శనివారం స్థానిక శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... సంఘం విజ్ఞప్తి మేరకు యాజమాన్యం ఈ నెల 17 నుంచి ప్రారంభించనుందన్నారు. సౌమ్య, ప్రణయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

### ఏచూరికి ఘన నివాళి

**సుజాతనగర్:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కార్యాలయంలో సంతాప సభను ఏర్పాటు చేసి ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. మండల కార్యదర్శి వీర్ల రమేష్, నాయకులు కొమరారెడ్డి, కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, బాబా, మల్లేష్, బత్తిని వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లెందురూరల్:** మండలంలోని సీఎస్సీ బస్తీ పంచాయతీ దేవుపల్లియాకయ్య నగర్‌లో నిర్వహించిన సంతాప సభలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు అబ్దుల్ నబి, అలేటి కిరణ్, మస్యం మోహన్‌రావు, రాందాస్, రాంచందర్, సంజీవ్, కృష్ణ, వేణు, శ్రీను పాల్గొన్నారు.

**పాల్వంచరూరల్:** మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్, ఎస్ఎఫ్ఐ మాజీ జాతీయ అధ్యక్షులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## బ్యాంకు సేవలతో ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

**ఇల్లెందురూరల్:** బ్యాంకుల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని ఎస్‌బీఐ ఆర్‌ఎం సత్యనారాయణ ఆకాంక్షించారు. మండలంలోని రేపల్లెవాడ రైతువేదికలో రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన విధంగా రుణమాఫీ పొందిన రైతులకు అంతే మొత్తంలో కొత్త రుణాలను అందజేస్తున్నామన్నారు. పొదుపు సంఘాలకు కూడా బ్యాంకు ద్వారా విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నామని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు మనుగడకు ఖాతాదారులు సహకరించాలని కోరారు. ప్రతీ ఖాతాదారుడు బ్యాంకు ద్వారా నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించి ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పొందాలని సూచించారు. ముకుందాపురం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సతీష్, అధికారులు ప్రఫుల్, రామకృష్ణ, మాజీ సర్పంచ్ కౌసల్య, పీఏసీఎస్ డైరెక్టర్ కొమరయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

### బురదలో దిగబడిన పాఠశాల బస్సు



బస్సును బయటకు తీస్తున్న స్థానికులు

**సుజాతనగర్:** కొత్తగూడెం పట్టణానికి చెందిన ఓ ప్రయివేటు పాఠశాల బస్సు శనివారం బురదలో దిగబడిపోవడంతో సుమారు గంటన్నర సేపు విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రోజూ మాదిరిగా పాఠశాల బస్సు సుజాతనగర్‌లో పిల్లలను ఎక్కించుకుని జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో బస్సును తిప్పుతుండగా బురదలో ఇరుక్కుపోయింది. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది, స్థానికులు శ్రమించి ట్రాక్టర్, జేసీబీ సాయంతో బయటకు తీశారు.

### బీటీ రోడ్డు పనులు ప్రారంభం

**జూలూరుపాడు:** మండలంలోని అనంతారం నుంచి నల్లబండబోడు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు శనివారం మొదలయ్యాయి. నల్లబండబోడు మాజీ సర్పంచ్ ముక్తి నరసింహారావు ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కల్తీ రాఘవులు, మందరెకల లక్ష్మయ్య, బచ్చల శ్రీను, బచ్చల లక్ష్మయ్య, కొర్సా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఆక్రమణకు గురైన చెరువు భూమిని వెలికితీయాలి

**సుజాతనగర్:** ఆక్రమణకు గురైన సింగభూపాలెం చెరువు భూమిని వెలికితీయాలని మాదిగ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం సింగభూపాలెం చెరువు కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గతంలో చెరువు కట్ట కృంగిన సమయంలో నాసిరకంగా పనులు చేశారని ఆరోపించారు. అదేవిధంగా చెరువుకు సంబంధించిన వందలాది ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని, ఆ భూమిని తక్షణమే వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల భాస్కర్, దామెర్ల సర్వేశ్వరరావు, రామకృష్ణ, కత్తి వెంకన్న, కాకటి బాబు, సిద్దెల నరేందర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

### హిందీ భాషా దినోత్సవం

**పాల్వంచరూరల్:** హిందీ నేర్చుకోవడంతో జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీభాషా గొప్పతనంపై ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం హిందీ అధ్యాపకురాలిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.అరుణకుమారి, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, ఏ.వెంకటేశ్వర్లు, కామేశ్వరరావు, స్వరూపరాణి పాల్గొన్నారు.

## వరదలతో 363 ఎకరాల్లో పంట నష్టం



ఇసుక మేట పెట్టి కొట్టుకుపోయిన పత్తిపంట

**పాల్వంచరూరల్:** ఇటీవల కురిసిన భారీవర్షాలతో మండలంలో 363 ఎకరాల్లో పంటలకు నష్టం వాట్లిందని వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు సర్వేలో గుర్తించారు. మండలంలోని ఉల్వనూరు, దంతలబోరు, తోగ్గూడెం, రంగాపురం, నాగారం, బంద్రుగొండ, యానంబైల్ తదితర గ్రామాల్లో చేపట్టిన సర్వే పూర్తయింది. 363 ఎకరాల్లో రూ.36.20 లక్షల విలువైన పంటలకు నష్టం వాటిల్లినట్లు నివేదిక అందించామని ఏఓ శంకర్ తెలిపారు. అలాగే, కిన్నెరసాని, లోద్దిగండి వాగుల సమీపాన 30 ఎకరాల వరిపొలాల్లో ఇసుక మేటలు వేసిందని వెల్లడించారు.

### నేడు పూజా సామగ్రి పంపిణీ

**కొత్తగూడెంటౌన్:** గణేష్ నిమజ్జనం పురస్కరించుకుని కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మండపాలకు గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పూజా సామగ్రిని ఉచితంగా అందించనున్నట్లు కొత్తగూడెం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కె.వి రంగాకిరణ్ అన్నారు. శనివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్తగూడెం భజన మందిరం సమీపంలో ఉన్న వివేకానంద స్కూల్‌లో పూజా ద్రవ్య సామగ్రి ఉచితంగా అందిస్తామని, ప్రతీ మండపాలకు సంబంధించిన నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి దారా రమేష్, గౌరవ అధ్యక్షులు వందనపు శ్రీదర్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కూర శ్రీధర్, భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ మెరుగు చింటూ, ముచ్చర్ల కిరణ్, పులిగంటి వెంకటేశ్వర్లు, కూసన సాగర్ పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న కౌన్సిలర్ ధర్మరాజు

**కొత్తగూడెం అర్బన్:** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని కౌన్సిలర్ ధర్మరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజిని అన్నారు. శనివారం కొత్తగూడెం రైటర్‌బస్తీ న్యూగొల్లగూడెం, గొల్లగూడెంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్‌లు సరస్వతి, కృష్ణవేణి, ఆయాలు, ఆశాలు దేవి, ఏఎన్ఎంలు అనిత, భవాని పాల్గొన్నారు.

### గ్యాస్ ధ్రువపత్రాల పంపిణీ

**సింగరేణి(కొత్తగూడెం):** కొత్తగూడెం 10వ వార్డ్‌లో సబ్సిడీ గ్యాస్ లబ్ధిదారులకు శనివారం కౌన్సిలర్ మునిగడప పద్మ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఆర్పీలు భానుజానకి, మేడిపల్లి కవిత, బొంతు కుశలన, ఖాజా మోహినొద్దీన్, తుమ్మ బాబురావు పాల్గొన్నారు.

**ఇల్లెందురూరల్:** మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన గ్యాస్ సబ్సిడీ పత్రాలను మండలంలోని సుభాష్‌నగర్‌లో శనివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి అందజేశారు. మాజీ ఉపసర్పంచ్, నాలవెల్లి నర్సింహారావు, ధనుంజయ్, అనిల్, వంశీ, షఫీ, కిషోర్, వెంకట్, కిరణ్ పాల్గొన్నారు.

### స్టడీ సర్కిల్ ప్రారంభం

**పాల్వంచరూరల్:** మండలపరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో కోమరంభీం భవనంలో మహాత్మా జ్యోతిరావు పూలే స్టడీ సర్కిల్‌ను బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బరగడి దేవదానం శనివారం ప్రారంభించారు. ముసలయ్య, నబీసాహెబ్, ఎస్‌డీటీ హుస్సేన్, రామచందర్ రావు, ముర్తుజా అలీఖాన్, రెహమాన్, నిమ్మల రాంబాబు, మంజూరు, సత్యనారాయణ, ఖాసీం, రమాదేవి, భరత్ ప్రభాకర్ ఉన్నారు.

## చెరువుల అభివృద్ధికి నిధులు

- సింగభూపాలెం చెరువు అభివృద్ధి, సుందరీకరణకు రూ.8.50 కోట్లు..
- చింతల చెరువుకు మరో కోటి మంజూరు
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**సింగరేణి(కొత్తగూడెం):** కొత్తగూడెం నియోజకవర్గంలో రెండు చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు, చుంచుపల్లి మండలంలోని చింతల చెరువు అభివృద్ధికి నిధులు మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం వివరాలు వెల్లడించారు. సింగభూపాలెం చెరువు ప్రాజెక్ట్ కట్ట అభివృద్ధితోపాటు సుందరీకరణ చేపట్టి, పర్యాటక కేంద్రంగా చేసేందుకు రూ.8.50 కోట్లు, చుంచుపల్లిలోని చింతల చెరువు ఆధునీకరణ, కట్ట రిపేరుకు రూ.కోటి మంజూరైనట్టు తెలిపారు. ఈ నిధులతో త్వరలో పనులు ప్రారంభమవుతాయని, ఫలితంగా సింగభూపాలెం చెరువు నీటి వృథా అరికట్టడమే కాకుండా నీటి సామర్థ్యం పెరిగి చెరువు పరివాహక రైతులకు మేలు జరిగి, పర్యాటక కేంద్రంగా మారితే ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. అదేవిధంగా చింతల చెరువుతో ప్రతీ ఏటా సమీప ప్రాంతాలకు ముంపునకు గురి అయ్యే ప్రమాదం నుండి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

**కలెక్టర్ చర్యలు అభినందనీయం..**

ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా జిల్లా అధికారయంత్రాంగం స్పందించిన తీరు అభినందనీయమని ఎమ్మెల్యే సాంబశివరావు అన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ... వర్షాలకు ధ్వంసమైన ప్రధాన, అంతర్గత రోడ్లు, కల్వర్టులు, చెరువులు, యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించటంలో మండల స్థాయి అధికారులను, వివిధ శాఖల జిల్లా అధికారులను అప్రమత్తం చేయటంలో కలెక్టర్ జితేష్.వి. పాటిల్ సమఫలమయ్యారని, కొద్దిరోజుల్లోనే పరిస్థితిని యథాస్థితికి తీసుకురావటంలో తీవ్రంగా కృషి చేశారన్నారు. వరదలతో ఇబ్బంది కలగకుండా కలెక్టర్, ఎస్పీ తీసుకున్న జాగ్రత్తలు ప్రజలకు మేలు చేశాయని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో తమ సేవలు అందించాలని కోరారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యేలు



మహేష్‌కుమార్ గౌడ్‌తో ఎమ్మెల్యే, నాయకులు



టీపీసీసీ చీఫ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు కనకయ్య, జారె

**ఇల్లెందు/కొత్తగూడెం రూరల్:** టీపీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల నియామకమైన బి.మహేష్‌కుమార్ గౌడ్‌ను పలువురు ఎమ్మెల్యేలు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్‌ను ఇల్లెందు, వైరా, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోతు రాందాస్‌నాయక్, జారె ఆదినారాయణ తదితరులు కలిశారు. నాయకులు మోతుకూరి ధర్మారావు, గుగులోతు కృష్ణా, రాజేష్, నాగులు, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు కృతజ్ఞతలు

**జూలూరుపాడు:** కాకర్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కాకర్ల పరిసర గ్రామాల్లో లో ఓల్టేజ్ సమస్యతో ప్రజలు అసౌకర్యానికి గురి అవుతున్న నేపథ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సీతాలక్ష్మి

**కొత్తగూడెంఅర్బన్/ సింగరేణి (కొత్తగూడెం):** ముందస్తు చర్యల్లో భాగంగా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ అన్నారు. శనివారం రామవరం ఆరో వార్డు పాత పోస్టాఫీస్ సెంటర్‌లో రామవరం యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాము ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరు మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం బీపీ, షుగర్, డెంగీ, మలేరియా, టెస్టులు, ర్యాపిడ్ కిట్‌ల ద్వారా పరీక్షలు చేసి రిపోర్టు ఆధారంగా తగిన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాము, కె.రాజేశ్వరీ, కవిత, శిరీష, ఆర్పీ, నాగమణి, రాధిక, భవానీ రాజమణి, రాణి, సుజాత, నిర్మల ఉన్నారు.

### పౌరహక్కుల సంఘం నేతల అరెస్ట్ అప్రజాస్వామికం

**సింగరేణి(కొత్తగూడెం):** జిల్లాలోని కరకగూడెం సమీపాన ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్తున్న పౌరహక్కుల సంఘం నేతలను అడ్డుకోవడం అప్రజాస్వామికమని మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం పేర్కొన్నారు. కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన చేస్తున్నామని గొప్పలు చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం పౌరహక్కుల సంఘం నేతలను అరెస్ట్ చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. అలాగే, నాయకులను అరెస్ట్‌పై పౌరహక్కుల సంఘాల జిల్లా నాయకులు కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాయకులు ఉపేందర్‌రావు, జె.సీతారామయ్య, గౌని నాగేశ్వరరావు, సురేష్, ఉపేందర్, అలీమొద్దీన్, మారుతీరావు పాల్గొన్నారు.

**టేకులపల్లి:** పౌరహక్కుల సంఘం నాయకులను విడుదల చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరకగూడెం బూటకపు ఎన్‌కౌంటర్‌పై నిజ నిర్ధారణకు వెళ్తున్న పౌర హక్కుల సంఘం బృందాన్ని అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు.

## మన సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం



సింగరేణి(కొత్తగూడెం): వినాయక మండపంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

**సింగరేణి(కొత్తగూడెం):** మన సంస్కృతి, సాంప్రదాయలు, ఆచారాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తాయని, ఇది భారత పౌరులుగా మనం గర్వించ దగ్గ విషయమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు శనివారం పట్టణ, పరిసర ప్రాంతాల్లోని మండపాలు సందర్శించి పూజలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, దుర్గరాశి వెంకన్న, వాసిరెడ్డి మురళి, గెద్దాడు నగేష్, పాలమూరి శ్రీనివాస్, రాంజీ, కంచర్ల జమలయ్య, భుక్య శ్రీనివాస్, సుగుణ, పిడుగు శ్రీనివాస్, నేరేళ్ల సమైఖ్య పాల్గొన్నారు.

అదేవిధంగా గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ఇల్లెందు: పూజలు చేస్తున్న సీఐ సత్యనారాయణ



జూలూరుపాడు: కుంకుమపూజలో మహిళలు..



పాల్వంచ: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



టేకులపల్లి: ముత్యాలమ్మ గుడి బజార్‌లో..



ఇల్లెందురూరల్: హనుమంతులపాడులో అన్నదానం